# నా బాటలో...మధురమైన నా అనుభూతులు

**ముత్తన సుబ్బారావు**

**జనరల్ మేనేజర్ SAIL**

**1984, 10 వ తరగతి**

**చేకూరపాడు**

చేకూరపాడులోని మా శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ హై స్కూల్లో నేను చదువుకున్న రోజుల మధురానుభూతుల్ని పంచుకుంటున్నాను.

పర్యాటకపరంగా గానీ, సాంస్కృతికంగా గానీ, చారిత్రాత్మకంగా గానీ ఎటువంటి ప్రాముఖ్యం లేని ప్రాంతం అయినప్పటి భారత దేశంలో విద్య ఇంకా ప్రాబల్యం కాని అరవయ్యవ దశాబ్ది ప్రారంభంలో మా చేకూరపాడు గ్రామంలో ఇటువంటి అత్యంత విలువైన పాఠశాల ఎలా వచ్చిందనేది ఆశ్చర్యం కల్గించే విషయము. ఇటువంటి అసాధారణమైన పాఠశాలను స్థాపించడం వ్యవస్థాపకులు, యాజమాన్యం యొక్క అంకితభావానికి గొప్ప నిదర్శనం. మా పాఠశాల పచ్చని పొలాల మధ్య ఓ అందమైన చెరువు పక్కన విశాలమైన ఆటస్థలంతో అలంకరించబడి ఉంది. ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో ఆటపాటల ఆనందాలతో మా చదువుసంధ్యలు ఎంతో ఆరోగ్యకరమైన వాతావరణంలో సాగాయి. క్రమశిక్షణకు, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యకు, అద్భుతమైన క్రీడా సదుపాయాలకు చుట్టుపక్కల గ్రామాలలో మా పాఠశాల పెట్టింది పేరుగా ఉండేది. పాఠశాల వాతావరణానికి తోడు ఉపాధ్యాయుల అంకితభావం, అనుభవం, బోధనా పటిమ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేశాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

క్రీడలలోనూ మా పాఠశాల జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నోసార్లు పతకాలను సాధించడం నాకు ఇప్పటికీ గుర్తుంది. మా ఊరితో పాటు చుట్టుపక్కల ఆరేడు ఏడు గ్రామాల విద్యార్థులకు విద్యాసేవలను అందించింది మా పాఠశాల అని చెప్పటానికి గర్వంగా ఉంది. ఈ వజ్రోత్సవం సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు, యాజమాన్యాల విశేషమైన కృషిని గుర్తు చేసుకుంటూ వారి దూరదృష్టికీ అంకితభావానికీ వందనాలు చేస్తున్నాము.

మా ఉపాధ్యాయులు చక్కని స్వీయ క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి యొక్క శక్తి మరియు బలహీనతలను విశ్లేషించి వారు అభివృద్ధి చెందడానికి చేసిన శ్రమ మరియు ప్రణాళికలు అభినందనీయం. ఆ రోజుల్లో వారు చేసిన కృషిని తలచుకుంటే మనసు కృతజ్ఞతతో నిండిపోతుంది. ఉజ్జ్వల భవిష్యత్తు కోసం మాలో చైతన్య నింపటానికి మరియు భవిష్యత్తుపై ఆశలు పెంచడానికి మా ప్రిన్సిపల్ గారు వివిధ రంగాల్లోని అవకాశాలను వివరించిన రోజు నాకు ఇప్పటికీ గుర్తుంది. ఆ ప్రయత్నాలు ఎందరో విద్యార్థులు అనూహ్యమైన విజయాలు సాధించడంలో సహాయపడ్డాయి అనడానికి సందేహం లేదు. గత ఆరు

దశాబ్దాలుగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చదిద్దటమే ప్రథమ కర్తవ్యం అని విశ్వసించే పాఠశాలలో చదువుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాను. మా ఉపాధ్యాయుల కర్తవ్య దీక్ష మరియు అలుపెరుగని కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాము.

సాధారణంగా గ్రామాల్లోని విద్యార్థులు విభిన్నమైన ఆర్థిక, విద్య మరియు జీవన ప్రమాణాలు కలిగి ఉంటారు. ఆ కాలంలోని ఎక్కువ మంది తల్లితండ్రులు తమ కుటుంబాలను పోషించడం కోసం విద్య కంటే రోజువారి సంపాదనకి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి తమ పిల్లలను పాఠశాలకు పంపడానికి వెనుకాడేవారు. అయినప్పటికీ ఉపాధ్యాయుల నిరంతర కృషి మరియు చక్కటి గౌరవప్రదమైన పాఠశాల వాతావరణం వల్ల గ్రామంలోని తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను పాఠశాలకు పంపడం గర్వంగా భావించారు. కుల,మత మరియు ఆర్థిక అడ్డంకులను తుడిచివేసి విద్యకే ప్రాధాన్యం ఇవ్వడానికి ఉపాధ్యాయులు అవిశ్రాంతంగా పనిచేశారు. సమానత్వం, స్వచ్ఛమైన పోటీ తత్వం మరియు మంచి ఫలితాలే ఆలోచనగా సంస్కృతిని సృష్టించి ఎందరో ఉత్తమ విద్యార్థులను తయారుచేశారు.

మొదటగా నన్ను బయట ప్రపంచానికి పరిచయం చేసింది మా పాఠశాల, ఉపాధ్యాయుల శ్రద్ధ మరియు నాలో వారు నింపిన విలువలు నా వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడమే కాకుండా నా ప్రవర్తనను మరియు ఆలోచనా విధానాన్ని సరిచేసాయి. ఖాళీ సమయాల్లో మేము గడిపిన సరదాలు, స్నేహాలు మరియు పోటీలు అనుదినం ఆసక్తికరంగా మలిచాయి. సమాజంలో ఉన్న ఎలాంటి ప్రతికూల శక్తులు మా దరిదాపులకు రాకుండా మా బాల్యం ఆహ్లాదకరంగా ఉండేలా చేసింది మా పాఠశాల.

మా ప్రిన్సిపాల్ శ్రీయుతులు టి. గురవయ్యగారికి చాలా భయపడిన రోజులు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి ఆయన కనిపించినప్పుడల్లా ఆయననుండి తప్పించుకోడానికి మేము మా మార్గాన్ని మార్చుకునే వాళ్ళం. అయినప్పటికీ మా ఉపాధ్యాయులు శిక్షణ కోసం దూరంగా ఉన్నప్పుడు విద్యార్థులకు గణిత తరగతి భోదించమని నన్ను కోరడం నాలోని ఆత్మవిశ్వాసాన్ని తట్టి లేపింది. ఆ విధంగా మాలో ఉత్సుకతను మరియు విశ్వాసాన్ని రెట్టింపు చేసే యే అవకాశాన్నైనా మా ఉపాధ్యాయులు వదిలేవారు కాదు. వారి స్ఫూర్తిదాయకమైన మాటలు మరియు మార్గదర్శకత్వం మా బంగారు భవిష్యత్తుకు బాటలు వేశాయి.

మా SVSO స్కూలు నా వ్యక్తిత్వాన్ని మరియు నా ప్రత్యేకతను నేను గుర్తించటంలో సహాయం చేసింది. పరిస్థితుల నుండి ప్రేరణ పొందడం కృషి, క్రమశిక్షణ మరియు ఆత్మవిశ్వాసాల విలువలను నాకు నేర్పింది. క్లిష్ట సమయాల్లో మంచి నిర్ణయాత్మక శక్తిని ఇచ్చి, అమూల్యమైన ఆనంద క్షణాలను అందించి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేసినటువంటి గురువుల పర్యవేక్షణలో విద్యాభ్యాసం చేయటం మాకు దేవుడిచ్చిన వరం. మా అజ్ఞానాన్నీ అమాయకత్వాన్నీ తొలగించి

మా జీవితాన్ని చక్కదిద్దిన పాఠశాలకు వెళ్లే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సమయంలో దూరదృష్టి గల యాజమాన్యమునకు మరియు అంకితభావం గల ఉపాధ్యాయులకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**ముత్తన సుబ్బారావు**